
# మన చౌరాస్తా
తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 240 | ఎడిటర్ : ఉప్పలంచి నరేందర్ | బుధవారం, 05 ఆగస్టు 2026 | పేజీలు :4

## జనగామకు నిధులివ్వండి

- వైద్య ఆరోగ్య శాఖ సమీక్షలో ఎమ్మెల్యే పల్లా

2



## అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు

# టీ-ఫైబర్‌తో ఇంటర్నెట్

- ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆదేశం

**హైదరాబాద్, మన చౌరాస్తా :** తెలంగాణలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు సెప్టెంబర్ 1 నుంచి టీ ఫైబర్ ద్వారానే ఇంటర్నెట్ సేవలు అందించాలని అధికారులను ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆదేశించారు. రాష్ట్ర సచివాలయంలో టీ ఫైబర్ సేవల విస్తరణపై మంత్రి ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్ణీత గడువులోగా రాష్ట్రంలోని ప్రతి ప్రభుత్వ కార్యాలయానికి టీ ఫైబర్ కనెక్టివిటీ కల్పించాలని స్పష్టం చేశారు. సెప్టెంబర్ 1 తర్వాత ఏ ప్రభుత్వ శాఖ కూడా ప్రైవేట్ ఇంటర్నెట్ సేవలను వినియోగిస్తూ బిల్లులు చెల్లించవద్దని మంత్రి ఆదేశించారు. ప్రభుత్వ నిధుల ఆదాతో పాటు ఏకీకృత డిజిటల్ నెట్‌వర్క్ ఏర్పాటు లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రభుత్వ విభాగాలు వినియోగిస్తున్న టీ స్వాన్ నెట్‌వర్క్‌ను వచ్చే నెల రోజుల్లో పూర్తిగా టీ ఫైబర్‌కు బదిలీ చేయాలని సంబంధిత అధికారులకు స్పష్టమైన గడువు విధించారు. ఈ ప్రక్రియలో ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని రూపుదిద్దుకుంటున్న ఫ్యూచర్ సిటీకి అత్యాధునిక టీ ఫైబర్ కనెక్టివిటీ కల్పించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని శ్రీధర్ బాబు ఆదేశించారు. అలాగే ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న 'ఇంటింటికీ ఇంటర్నెట' కార్యక్రమాన్ని మరింత వేగవంతం చేసి గ్రామీణ ప్రాంతాల వరకు నాణ్యమైన బ్రాడ్‌బ్యాండ్ సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. గడువులోగా లక్ష్యాలను పూర్తి చేసి తెలంగాణను దేశంలోనే అత్యుత్తమ డిజిటల్ కనెక్టివిటీ కలిగిన రాష్ట్రంగా తీర్చిదిద్దాలన్నారు. ఇందుకు అధికారులంతా సమన్వయంతో పనిచేయాలని మంత్రి శ్రీధర్ బాబు సూచించారు.

## ఇంజనీరింగ్ విద్యార్థుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీస్తారా

### సీఎం రేవంత్ వ్యాఖ్యలపై ఎంపీ అర్వింద్ ఆగ్రహం

ఇంజనీరింగ్ విద్యార్థులపై సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను బీజేపీ ఎంపీ ధర్మపురి అరవింద్ ఖండించారు. విద్యార్థులు, తల్లిదండ్రుల ఆత్మస్థయిర్యాన్ని దెబ్బతీసేలా సీఎం వ్యాఖ్యలు ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్య పట్ల చిత్తశుద్ధి లేని వ్యక్తి విద్యాశాఖ మంత్రిగా ఉండటం సరైనది కాదని అరవింద్ అన్నారు. విద్యాశాఖ బాధ్యతలను మంత్రి శ్రీధర్ బాబుకు అప్పగిస్తే బాగుంటుందని సూచించారు.

**- మన చౌరాస్తా, హైదరాబాద్**



3 లో

# మీ ప్లాన్ బాగుంది

- 'యాక్షన్ ప్లాన్-2026' పుస్తకంపై కేంద్ర నోడల్ అధికారి ప్రశంసలు
- పీఎం ధన్ ధాన్య కృషి యోజన సమీక్షలో జాయింట్ సెక్రటరీ బల్దేవ్ పురుషార్థ

నేల స్వభావం, వాతావరణం, మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా పంటల సాగు విధానం ఉండాలని కేంద్ర ఆర్థిక వ్యవహారాల శాఖ జాయింట్ సెక్రటరీ, పీఎం ధన్ ధాన్య కృషి యోజన (PMDDKY) కేంద్ర నోడల్ అధికారి బల్దేవ్ పురుషార్థ సూచించారు. మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధ్యక్షతన జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎల్‌నీనో పరిస్థితులను తట్టుకునేలా జిల్లా కలెక్టర్ రూపొందించిన "తెలంగాణ అగ్రికల్చర్ ఎమర్జెన్సీ అండ్ ఆల్టర్నేటివ్ యాక్షన్ ప్లాన్ - వర్షాకాలం 2026" పుస్తకాన్ని ఆయన పరిశీలించి, అభినందించారు.

**- మన చౌరాస్తా, జనగామ**

2






## రేపు జిల్లాలో రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ పర్యటన

2

## ఎన్‌హెచ్163పై సర్వీస్ రోడ్లను వెంటనే పూర్తి చేయాలని ఎంపీ వినతి

2



## 'యాక్షన్ ప్లాన్–2026' పుస్తకంపై
# కేంద్ర నోడల్ అధికారి ప్రశంసలు

- **పీఎం ధన్ ధాన్య కృషి యోజన సమీక్షలో జాయింట్ సెక్రటరీ బల్దేవ్ పురుషార్థ**



**జనగామ, మన చౌరాస్తా :** నేల స్వభావం, వాతావరణం, మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా పంటల సాగు విధానం ఉండాలని కేంద్ర ఆర్థిక వ్యవహారాల శాఖ జాయింట్ సెక్రటరీ, పీఎం ధన్ ధాన్య కృషి యోజన (PMDDKY) కేంద్ర నోడల్ అధికారి బల్దేవ్ పురుషార్థ సూచించారు. మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధ్యక్షతన జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎల్‌నీనో పరిస్థితులను తట్టుకునేలా జిల్లా కలెక్టర్ రూపొందించిన "తెలంగాణ అగ్రికల్చర్ ఎమర్జెన్సీ అండ్ ఆల్టర్నేటివ్ యాక్షన్ ప్లాన్ - వర్షాకాలం 2026" పుస్తకాన్ని ఆయన పరిశీలించి, అభినందించారు. ముందస్తు అంచనాతో ప్రత్యామ్నాయ పంటల ప్రణాళిక అందించడం ఇతర జిల్లాలకు ఆదర్శమని కొనియాడారు. అలాగే రాష్ట్రంలోనే తొలిసారిగా జనగామ జిల్లాలో ఏర్పాటు చేసిన 62 'మహిళా శక్తి రైతు సేవా కేంద్రాల' పనితీరును ప్రశంసించారు.

**సమీక్షలోని ముఖ్యాంశాలు:**

- **మైక్రో ప్లానింగ్ :** పీఎండీడీకేవై కింద రాబోయే 6 ఏళ్లలో నిర్దేశిత లక్ష్యాల సాధనకు ప్రతి మండలం, గ్రామానికి ప్రత్యేక సూక్ష్మ ప్రణాళిక రూపొందించాలి.
- **శాఖల సమన్వయం :** వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్ధక, మత్స్య, గ్రామీణాభివృద్ధి, నీటిపారుదల శాఖలు సమన్వయంతో పనిచేసి రైతుల ఆదాయాన్ని పెంచాలి.
- **జిల్లా ప్రగతి :** కలెక్టర్ వివరిస్తూ.. జిల్లాలో 1.55 లక్షల మంది రైతుల వివరాలు రైతు రిజిస్ట్రీలో నమోదయ్యాయని, 1,01,463 కిసాన్ క్రెడిట్ కార్డుల ద్వారా రూ.1,469 కోట్ల రుణాలు అందించామని తెలిపారు. జిల్లాలోని చెరువుల్లో నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచి, వ్యవసాయ అనుబంధ రంగాలను బలోపేతం చేయడం ద్వారా జనగామను ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దుతామని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తెలిపారు. ఈ సమావేశంలో డీఏఓ అంబికా సోనీ, డీఆర్డీఓ భాస్కర్, ఏపీడీ నూరుద్దీన్, డీవీహెచ్ఓ మురళీధర్ రావు, మత్స్య శాఖ అధికారి రాణా ప్రతాప్, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త రమ్య, సీపీఓ చినకోట్యా నాయక్, ఎల్డీఎం ప్రతిభ, చేనేత, జౌళి శాఖ అధికారి బాబు, సర్వే & ల్యాండ్స్ ఏడీ మన్యంకొండ, నీటి పారుదల శాఖ ఎస్ఈ సీతారాం, ఇతర సంబంధిత అధికారులు, వ్యవసాయ శాఖ ఏడీఏలు, ఎంఏఓలు, ఉద్యానవన శాఖ అధికారులు పాల్గొన్నారు.

## ఎన్‌హెచ్163పై అసంపూర్తి సర్వీస్ రోడ్లను వెంటనే పూర్తి చేయాలి


- **ఎన్‌హెచ్ఏఐ చైర్మన్‌కు వరంగల్ ఎంపీ కావ్య వినతి**



**న్యూఢిల్లీ, మన చౌరాస్తా :** యాదాద్రి -వరంగల్ జాతీయ రహదారి 163పై అసంపూర్తిగా ఉన్న సర్వీస్ రోడ్ల నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య కోరారు. మంగళవారం న్యూఢిల్లీలో జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) చైర్మన్ సంతోష్ కుమార్ యాదవ్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. నిడిగొండ, రఘునాథపల్లి, చాగల్, స్టేషన్ ఘన్‌పూర్, చిన్నపెండ్యాల, కరుణాపురం తదితర గ్రామాల పరిధిలో సర్వీస్ రోడ్ల మధ్య లింకులు లేకపోవడం వల్ల స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వాహనాలు ప్రధాన రహదారిపైకి రావడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని, విస్తరణ సమయంలోనే భూసేకరణ పూర్తయినందున మిగిలిన లింకులను వెంటనే నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఎన్‌హెచ్ఏఐ చైర్మన్ అధికారులతో సమీక్షించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు ఎంపీ తెలిపారు.


## ఉమ్మడి వరంగల్ వైద్య ఆరోగ్య శాఖపై దామోదర సమీక్ష

### పాల్గొన్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి



**హైదరాబాద్, మన చౌరాస్తా :** తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సి. దామోదర్ రాజనర్సింహ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని డా. బి.ఆర్. అంబేడ్కర్ సచివాలయంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని నియోజకవర్గాల వారీగా వైద్య ఆరోగ్య శాఖల పనితీరుపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జనగామ శాసనసభ్యులు డా. పల్లా రాజేశ్వర్ రెడ్డి పాల్గొని జనగామ నియోజకవర్గంలో వైద్య సేవల విస్తరణపై మాట్లాడారు. జనగామ MCH ప్రభుత్వ ఆసుపత్రి, ప్రభుత్వ మెడికల్ కాలేజీ, నియోజకవర్గంలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (PHC), ఉప కేంద్రాలతో పాటు చేర్యాల CHC ఆసుపత్రిలో ప్రస్తుతం ఉన్న సౌకర్యాలు, కావలసిన వసతులు, సిబ్బంది కొరత మరియు వైద్య పరికరాల అవసరంపై సుదీర్ఘంగా చర్చించారు. అనంతరం వీటికి సంబంధించిన వివరాలతో కూడిన అభ్యర్థన పత్రాన్ని మంత్రి రాజనర్సింహకు లిఖిత పూర్వకంగా సమర్పించారు.

## రేపు జిల్లాలో రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి పర్యటన



**జనగామ, మన చౌరాస్తా :** ఈ నెల 6న తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ గద్వాల విజయలక్ష్మి జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 9 గంటలకు జిల్లా కేంద్రంలోని ఆర్ అండ్ బీ అతిథి గృహానికి చేరుకోనున్న ఆమె, అనంతరం బాలల గృహం, సఖి కేంద్రం, ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని సందర్శించి వైద్య సేవలు, సదుపాయాలను పరిశీలిస్తారు. కలెక్టరేట్ లో గౌరవ వందనం స్వీకరించిన అనంతరం, సమీకృత కలెక్టర్ కార్యాలయంలో మహిళల అవగాహన సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరవుతారు. మధ్యాహ్నం పాలకుర్తి సోమేశ్వర లక్ష్మీనరసింహ స్వామిని దర్శించుకున్న తర్వాత, జిల్లా అధికారులతో మహిళల భద్రత, సంక్షేమంపై సమీక్షా సమావేశం నిర్వహిస్తారు. సాయంత్రం ఆర్ అండ్ బీ గృహంలో స్థానిక ప్రజల నుంచి వినతులు స్వీకరించి, సమస్యలు తెలుసుకున్న అనంతరం హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణమవుతారు.

## ఉచిత విద్య, వైద్యం అందే వరకు పోరాటం ఆగదు : ఈగం శ్రీనివాస్



**జనగామ, మన చౌరాస్తా :** దేశంలో పేదరికం పెరగడానికి విద్య, వైద్యం వ్యాపారంగా మారడమే ప్రధాన కారణమని, ప్రజలందరికీ ఇవి ఉచితంగా అందే వరకు తమ పోరాటం ఆగదని ఈగం శ్రీనివాస్ స్పష్టం చేశారు. ఎన్నికల సమయంలో 'కేజీ టూ పీజీ' ఉచిత విద్య అందిస్తామని హామీ ఇచ్చే రాజకీయ నాయకులు, అధికారంలోకి వచ్చాక దాన్ని పక్కన పెడుతున్నారని విమర్శించారు. లక్షలు వెచ్చించి చదివినా ఉద్యోగాలు లేవని, సరైన సమయానికి వైద్యం అందక సామాన్యులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సంక్షేమ పథకాల కంటే ఉచిత విద్య, మెరుగైన ఉచిత వైద్యం అందిస్తే ప్రజలు తమ కాళ్ళపై తాము నిలబడతారని పేర్కొన్నారు. తమ ఉద్యమానికి ఏ రాజకీయ పార్టీతో సంబంధం లేదని, ప్రజల హక్కుల సాధన కోసం మేధావులు, కార్మికులు, విద్యార్థులు, సకల జనులు మద్దతుగా నిలవాలని ఆయన పిలుపునిచ్చారు.



## పుట్టిన రోజు సందర్భంగా అల్పాహార పంపిణీ

**జనగామ, మన చౌరాస్తా :** కబడ్డీ ఆటగాడు గూగులోత్ శోభన్ పుట్టినరోజును పురస్కరించుకుని జనగామ జిల్లా ఏరియా ఆసుపత్రి, ఆర్టీసీ బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో జనగామ అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పేదలకు అల్పాహారం అందించారు. శోభన్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ఫౌండేషన్ నాయకులు, ఆయన సేవా దృక్పథం నేటి యువతకు స్ఫూర్తిదాయకమని కొనియాడారు. ఈ సందర్భంగా అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంతెన మణికుమార్, ప్రధాన కార్యదర్శి వంగ భీమ్ రాజ్ మాట్లాడారు. దేశంలో ఆకలి చావులు లేని సమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, గ్రామాలు, పట్టణాల్లోని యువత ముందుకొచ్చి సామాజిక సేవా కార్యక్రమాలలో పాలు పంచుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సేవాలాల్ సేన జిల్లా యువజన అధ్యక్షుడు తేజవత్ మోహన్ నాయక్, గణేష్, సంపత్, అమ్మ ఫౌండేషన్ వైస్ ప్రెసిడెంట్ కొయ్యడా రవి, బింగి నరసింహులు, కార్తీక్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.





# బస్ భవన్ ముట్టడిలో ఉద్రిక్తత

- పోలీసులతో వాగ్వాదం
- వారం రోజుల్లో బెనిఫిట్స్ ఇవ్వకపోతే ప్రభుత్వంపై యుద్ధమే!
- టీఆర్‌పీ చీఫ్ తీన్మార్ మల్లన్న



**హైదరాబాద్, మన చౌరాస్తా :** టీజీఎస్ ఆర్టీసీ విశ్రాంతి ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోరి హైదరాబాద్‌లోని బస్ భవన్ వద్ద నిర్వహించిన ఆందోళన తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. రిటైర్డ్ ఉద్యోగులకు మద్దతుగా తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టీఆర్‌పీ) చీఫ్, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న బస్ భవన్‌కు చేరుకోగా పోలీసులు అడ్డుకోవడంతో కొద్దిసేపు వాగ్వాదం జరిగింది. అనంతరం మల్లన్నతో పాటు ఐదుగురు రిటైర్డ్ ఉద్యోగుల ప్రతినిధుల బృందం అధికారులను కలిసి, పెండింగ్ బకాయిలపై తీవ్రంగా నిలదీసింది. 2013, 2017, 2021 వేతన సవరణలు, PF బకాయిలు, EPS95, DA మరియు ఇతర రిటైర్మెంట్ బెనిఫిట్స్‌ను ఏళ్లుగా నిలిపివేయడం అమానుషమని మల్లన్న మండిపడ్డారు. జీవితాంతం కష్టపడిన 17 వేల మంది రిటైర్డ్ ఉద్యోగుల సొమ్మును చెల్లించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడిన మల్లన్న.. ఎన్నికల సమయంలో ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీరు వల్లనే కార్మికులకు ఈ పరిస్థితి వచ్చిందన్నారు. ఆర్టీసీ ఉద్యోగులకు ఇచ్చిన హామీలపై కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఎల్లప్పుడూ ఆర్టీసీ కార్మికుల పక్షాన నిలుస్తుందని మల్లన్న స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బహుజన్ వర్కర్స్ యూనియన్ చైర్మన్ సంపత్ ముదిరాజ్, రాష్ట్ర అధ్యక్షుడు మొహమ్మద్ సాజిద్, గ్రేటర్ హైదరాబాద్ జోన్ BWU గౌరవ అధ్యక్షుడు TVR, తెలంగాణ రాజ్యాధికార పార్టీ మహిళా అధ్యక్షురాలు పటేల్ వనజక్క, సహాయ కార్యదర్శి గిరిగాని బిక్షపతి గౌడ్ మరియు పెద్ద సంఖ్యలో రిటైర్డ్ ఆర్టీసీ కార్మికులు పాల్గొన్నారు.



# ఒకటో తేదీన తే జీతం ఇవ్వడం.. ప్రభుత్వ మానవతా దృక్పథానికి నిదర్శనం

- ఒకేషనల్ జూనియర్ అధ్యాపకులు

**జనగామ, మన చౌరాస్తా :** చరిత్రలో మొట్టమొదటిసారిగా జిల్లాలోని అన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలల ఉద్యోగులకు ఆగస్టు 1న జీతాలు జమ కావడంతో ఒకేషనల్ ఒప్పంద అధ్యాపకులు సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక చొరవ చూపిన జనగామ జిల్లా ఇంటర్మీడియట్ విద్య అధికారి (డీఐఈఓ) కల్లూరి జితేందర్ రెడ్డిని మంగళవారం ఒకేషనల్ ఒప్పంద అధ్యాపకులు శాలువా, పుష్పగుచ్ఛంతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఒకేషనల్ ఒప్పంద అధ్యాపకులు మరిపెల్ల రవి ప్రసాద్, కదిర రవీందర్, బిల్లా శంకర్ మాట్లాడుతూ.. ప్రతినెల 1నే జీతం అందించడం రేవంత్ రెడ్డి గారి ప్రజా ప్రభుత్వ మానవతా దృక్పథానికి నిదర్శనమన్నారు. రెగ్యులరైజేషన్ విషయంలో గత ప్రభుత్వం చేసిన అన్యాయంపై కోర్టులలో పోరాడుతున్నామని, ఒకే లెక్చరర్ ఉన్నచోట మరొక గెస్ట్ లెక్చరర్‌ను నియమించాలని కోరారు. డీఐఈఓ జితేందర్ రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగులంతా మరింత బాధ్యతతో పనిచేసి విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేయాలని సూచించారు. కోర్టు తీర్పులు వచ్చే వరకు ఓపికతో ఉండాలని అధ్యాపకులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు పరికమంజుల, ఓశపాక మీనా, నందగిరి కృష్ణవాణి తదితరులు పాల్గొన్నారు.

# ఇంజనీరింగ్ విద్యార్థుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీస్తారా

**సీఎం రేవంత్ వ్యాఖ్యలపై ఎంపీ అర్వింద్ ఆగ్రహం**


**న్యూఢిల్లీ, మన చౌరాస్తా :** ఇంజనీరింగ్ విద్యార్థులపై సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను బీజేపీ ఎంపీ ధర్మపురి అరవింద్ ఖండించారు. విద్యార్థులు, తల్లిదండ్రుల ఆత్మస్థయిర్యాన్ని దెబ్బతీసేలా సీఎం వ్యాఖ్యలు ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్య పట్ల చిత్తశుద్ధి లేని వ్యక్తి విద్యాశాఖ మంత్రిగా ఉండటం సరైనది కాదని అరవింద్ అన్నారు. విద్యాశాఖ బాధ్యతలను మంత్రి శ్రీధర్ బాబుకు అప్పగిస్తే బాగుంటుందని సూచించారు. రాష్ట్రంలోని విద్యా వ్యవస్థను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఆయన విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డికి ఎంపీ అరవింద్ సవాల్ విసిరారు. ఎవరి సహకారం లేకుండా రేవంత్ రెడ్డి నామినేషన్ పత్రాలు నింపగలరా అని ప్రశ్నించారు. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో కనీస వసతులు కూడా లేవని అరవింద్ ఆరోపించారు. కొన్ని పాఠశాలల్లో బ్లాక్ బోర్డులు, చాక్ పీసులు, విద్యార్థులకు సరైన మరుగుదొడ్లు లేని పరిస్థితి ఉందన్నారు. విద్యాశాఖ మంత్రిగా సీఎం ఒక్క ప్రభుత్వ పాఠశాలను అయినా సందర్శించారా అని ప్రశ్నించారు.

# సీఎంఆర్‌లో పారదర్శకత ముఖ్యం

- బకాయిలు చెల్లించని డిఫాల్ట్ రైస్ మిల్లర్లపై కఠిన చర్యలు
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడి

**హైదరాబాద్, మన చౌరాస్తా:** తెలంగాణలో కస్టమ్ మిల్లింగ్ రైస్(సీఎంఆర్) వ్యవస్థపై పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కీలక సమీక్ష నిర్వహించారు. సీఎంఆర్ వ్యవస్థలో పారదర్శకత, సాంకేతిక సంస్కరణలపై చర్చించారు. గత 10-12 ఏళ్లుగా సీఎంఆర్‌లో జరిగిన వ్యవహారాలపై లోతుగా పరిశీలన చేపట్టారు. ప్రభుత్వానికి సీఎంఆర్ బకాయిలు చెల్లించని డిఫాల్ట్ రైస్ మిల్లర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని ఈ సమావేశంలో నిర్ణయించినట్లు సమాచారం. బకాయిల వసూళ్లపై ప్రత్యేకంగా దృష్టిసారించారు. ఇప్పటివరకు నిర్వహించిన విజిలెన్స్ దాడులు, నమోదైన కేసులు, వాటి దర్యాప్తు పురోగతిపై సమావేశంలో సమగ్రంగా చర్చించారు. జిల్లాల వారీగా రైస్ మిల్లర్ల పనితీరు, సీఎంఆర్ బకాయిల పరిస్థితి, డిఫాల్ట్‌ల వివరాలపై అధికారులు నివేదికలు సమర్పించారు. ప్రభుత్వ ఆస్తుల రక్షణకు కొత్త వ్యూహాలను రూపొందించాలని నిర్ణయించారు. ఇందుకు సంబంధించి పౌర సరఫరాల శాఖ, విజిలెన్స్, లీగల్ విభాగాల ఉన్నతాధికారులకు సమావేశానికి హాజరు కావాలని ఆదేశాలు జారీ అయ్యాయి. రైతుల ప్రయోజనాలను పరిరక్షించడం, ప్రభుత్వ నిధుల రక్షణెలి ఈ సమావేశం ప్రధాన లక్ష్యమని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

# రేణుకా ఎల్లమ్మ తల్లికి విశేష అలంకరణ



**జనగామ, మన చౌరాస్తా :** పట్టణంలోని 3వ వార్డు పరిధి గల బాలాజీ నగర్ శ్రీ రేణుకా ఎల్లమ్మ ఆలయంలో ఆషాడ మాసం మూడో మంగళవారం సందర్భంగా అమ్మవారికి నిమ్మకాయల మాలలతో ప్రత్యేక అలంకరణ చేశారు. దృష్టి దోషాలు తొలగి, ప్రజలకు ఆరోగ్యం, ఐశ్వర్యం, ప్రశాంతత కలగాలని భక్తులు అమ్మవారికి కుంకుమ పూజలు, అర్చనలు నిర్వహించి నైవేద్యం సమర్పించారు. అంటువ్యాధులు తగ్గి, పంటలు బాగా పండాలని అమ్మవారిని వేడుకున్నారు. ఆలయ పూజారి మారుపాక శ్యాం ప్రసాద్ ఆధ్వర్యంలో ఈ పూజా కార్యక్రమాలు జరగగా, అనంతరం మహిళలు ఆషాడ మాసం గోరింటాకు వేడుకలను ఉత్సాహంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు దూడల శోభారాణి, లగిశెట్టి పద్మావతి, దోసపాటి శ్రీలక్ష్మి, లోనే మంజుల, రాంపురం అనిత, పోగుల కవిత, తూంకుంట్ల విజయ, కొలనుపాక సునీత, సంబోజు జ్యోతి, బైరగోని సుజాత, మినులాపురం శోభా, అంబటి సుజాత, నిషిత, స్వాతి, వీణ, భాగ్య, ఆలేటి పద్మ, రేణుక, ప్రవీణ, కళావతి, సత్తెమ్మ, బండోజు సరళ, భోగ రజిని తదితరులు పాల్గొన్నారు.




# మత్స్యకారులకు ఇన్సూరెన్స్ సౌకర్యం

**సమీక్షలో మంత్రి వాకిటి శ్రీహరి వెల్లడి**



**హైదరాబాద్, మనచ చౌరాస్తా :** మత్స్యకారులకు ఇన్సూరెన్స్, మోపెడ్‌లు, రిటైల్ షాపుల ఏర్పాటుకు కార్యాచరణ రూపొందించాలని మంత్రి వాకిటి శ్రీహరి నిర్ణయించారు. ప్రతి మూడు నెలలకు మత్స్యకార సంఘాల అధ్యక్షులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించడం, ఉచిత చేప పిల్లల పంపిణీ పథకం కొనసాగింపుపై సమావేశంలో చర్చించారు. పెండింగ్ బకాయిల విడుదలకు ప్రత్యేకంగా కృషి చేస్తామని ఈ సందర్భంగా మంత్రి తెలిపారు. మత్స్యకారుల సంక్షేమంపై మంత్రి వాకిటి శ్రీహరి కీలక సమావేశం నిర్వహించారు. మత్స్య సహకార సంఘాల అధ్యక్షులు, ప్రమోటర్లతో చర్చలు జరిపారు. 26 వేల చెరువులు, 100 రిజర్వాయర్లలో చేపల పెంపకంపై ప్రత్యేకంగా దృష్టిసారించనున్నారు. మధ్యాహ్న భోజనంలో చేపలను చేర్చే ప్రతిపాదన పరిశీలనలో ఉందన్నారు. సభ్యత్వ వివాదాల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. కోహెడ ఇంటిగ్రేటెడ్ ఫిష్ మార్కెట్ నిర్మాణం కొనసాగుతోందన్నారు. ఆన్‌లైన్‌లో చేపల విక్రయాలకు ఇంటిగ్రేటెడ్ మార్కెట్ దోహదం చేస్తుందని చెప్పుకొచ్చారు. రూ.1.34 కోట్ల ఇన్సూరెన్స్ క్లైమ్‌లను ప్రభుత్వం క్లియర్ చేసిందన్నారు. మత్స్య సహకార సంఘాల అధ్యక్షుల ప్రోటోకాల్ అంశంపై ప్రభుత్వంతో చర్చిస్తామన్నారు. మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం పూర్తి ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి వాకిటి శ్రీహరి పేర్కొన్నారు.




# ఫౌజీ కోసం భారీ చార్మినార్ సెట్

## నిరంతరాయంగా షూటింగ్ కోసం ప్లాన్

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటిస్తున్న ప్రతిష్టాత్మక పీరియడ్ యాక్షన్ డ్రామా ఫౌజీ పై అభిమానుల్లో రోజురోజుకూ అంచనాలు పెరుగుతున్నాయి. దర్శకుడు హను రాఘవపూడి తెరకెక్కిస్తున్న ఈ భారీ చిత్రానికి సంబంధించిన తాజా అప్‌డేట్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. సినిమా చిత్రీకరణ కోసం హైదరాబాద్‌లో భారీ స్థాయిలో చార్మినార్ సెట్ నిర్మిస్తుండటం ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. సాధారణంగా చార్మినార్ నేపథ్యంలో సన్నివేశాలు చిత్రీకరించాలంటే పాతబస్తీ ప్రాంతాన్నే ఎంచుకుంటారు. అయితే 'ఫౌజీ' బృందం మాత్రం అందుకు భిన్నంగా నిర్ణయం తీసుకుంది. గచ్చిబౌలి`లింగంపల్లి ప్రధాన రహదారిలోని పాత అల్యూమినియం ఫ్యాక్టరీ ప్రాంగణంలో అసలు చార్మినార్‌ను తలపించేలా భారీ సెట్‌ను ప్రత్యేకంగా నిర్మిస్తోంది. నిజమైన కట్టడాన్ని పోలి ఉండేలా అత్యంత నైపుణ్యంతో ఈ సెట్‌ను రూపొంది స్తున్నట్లు తెలుస్తోంది. ప్రభాస్‌కు ఉన్న అపారమైన అభిమానుల ఆదరణను దృష్టిలో పెట్టుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. పాతబస్తీలో షూటింగ్ నిర్వహిస్తే వేలాది మంది అభిమానులు అక్కడికి చేరుకునే అవకాశం ఉండటంతో ట్రాఫిక్ సమస్యలు, భద్రతా ఇబ్బందులు తలెత్తే అవకాశముందని చిత్రబృందం భావించింది. షూటింగ్ ఎలాంటి ఆటంకాలు లేకుండా సజావుగా సాగేందుకు ప్రత్యేకంగా ఈ భారీ సెట్‌ను నిర్మిస్తున్నట్లు తెలుస్తోంది. తాజా సమాచారం ప్రకారం ఆగస్టు 3 నుంచి ప్రారంభమైన ఈ షెడ్యూల్ దాదాపు 25 రోజుల పాటు కొనసాగనుంది. ఈ షెడ్యూల్‌లో ప్రభాస్ కీలక సన్నివేశాల్లో పాల్గొననున్నారని సమాచారం. ఈ దశ పూర్తయిన తర్వాత సినిమా చిత్రీకరణ దాదాపు 90 శాతం పూర్తవుతుందని సినీ వర్గాలు చెబుతున్నాయి. అనంతరం పోస్ట్ ప్రొడక్షన్ పనులను వేగంగా పూర్తి చేసి విడుదలకు సిద్ధం చేయాలని మేకర్స్ ప్రణాళికలు సిద్ధం చేశారు. మైత్రీ మూవీ మేకర్స్ అధినేత వై. రవిశంకర్ స్పందిస్తూ, ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారమే డిసెంబర్ 3న 'ఫౌజీ' ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుందని స్పష్టం చేశారు. దాదాపు రూ.700 కోట్ల భారీ బడ్జెట్‌తో మైత్రీ మూవీ మేకర్స్, టీ`సిరీస్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. ఈ సినిమాతో ఇమాన్వి టాలీవుడ్‌కు కథానాయికగా పరిచయం కానుండగా, అనుపమ్ ఖేర్, మిథున్ చక్రవర్తి, జయప్రద వంటి ప్రముఖ నటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. చారిత్రక నేపథ్యం, విజువల్ గ్రాండియర్, ప్రభాస్ స్టార్‌డమ్ కలయికతో 'ఫౌజీ' భారతీయ సినీ ప్రేక్షకులకు ఒక సరికొత్త అనుభూతిని అందించేందుకు సిద్ధమవుతోంది.

Printed and Published by **UPPALANCHI POORNIMA** on behalf of UPPALANCHI POORNIMA, Printed at Hamara Warangal Printers and Graphics H.no.25-8-182, Balaji Nagar, Kazipet, Warangal, 506003., Published at H.No.4-8-65, Dharmakancha, Jangaon, Jangaon District. Telangana, 506167, Editor : **UPPALANCHI NARENDER**. Ph : **8555800812**, RNI : **TGTEL/25/A4350**